
# కోతిమంత్రం



- కలువకొలను సదానంద

( దూరంగా గుడి గంటల మోత. కాషాయ వస్త్రాలు ధరించి ఉన్న గురువూ, శిష్యుడూ రంగం మీదికి ప్రవేశించారు. గురువు వృద్ధుడు. గడ్డమూ, మీసాలూ తెల్లగా ఉన్నాయి. చంకలో జోలె, భుజం మీద గొంగళీ, చేతిలో దండకమండలాలూ ఉన్నాయి. శిష్యుడు యువకుడు. అతడి చంకల్లో జోలెలు వేలాడుతున్నాయి. వాటిల్లో నుంచి పాత్రలూ నగైరా బయటికి కనిపిస్తున్నాయి. నెత్తిన చిన్న మూట. గురువులో పాత్వికత, శిష్యుడిలో వినయ విధేయతలూ ద్యోతక మవుతున్నాయి.)

గురువు: ( ఆయాసంగా ఆగి ) హరహర మహాదేవ! శంభోశంకర! శిష్యా!

శిష్యుడు: గురుదేవా!

గురువు: (చుట్టూ చూచి) ఇక్కడ ప్రశాంతంగా ఉంది. ఈ పూటకు ఇక్కడ విడిది చేద్దాం.

శిష్యుడు: చిత్తం, గురుదేవా!

( గురువు గొంగళి కింద పరిచి, ఆయాస పడుతూ కూర్చున్నాడు. శిష్యుడు జోలెలూ, మూట కిందికి దించాడు).

గురువు: ( శిష్యుడి వైపు వాత్సల్యంగా చూస్తూ ) కుమారా! నిన్ను చూస్తున్నప్పుడల్లా నాకు ఒక వంక సంతోషం, మరో వంక జాలి. దేవుడు ఒకరికి కీడు చేయకుండా, మరొకరికి మేలు కలిగించ లేడేమో!

శిష్యుడు: క్షమించండి, గురుదేవా! తమ మాటల లోని ఆంతర్యం నాకు బోధ పడటం లేదు.

గురువు: తీర్థయాత్ర చేస్తున్న నాకు కన్యాకుమారి నుంచీ తోడుగా ఉంటున్నావు. నాకు సకల సపర్యలూ చేస్తున్నావు. కాటికి కాళ్ళు చాచు కున్న సన్యాసిని నేను. ఇంకా ముక్కు పచ్చ లైనా ఆరని పసివాడివి నువ్వు. జీవితంలోని సుఖాలన్నిటినీ వదులుకుని, బ్రహ్మచారిగా నా వెంట తిరుగుతున్నావు. నా శిష్యరికం వల్లనే కదా నీ కీ కష్టాలన్నీ!

శిష్యుడు: అలా అనకండి, గురువర్యా! సుఖం అంటే ఎలా ఉంటుందో తమ శిష్యరికం లోనే చూడగలుగుతున్నాను. భోగ భాగ్యాల కోసం పరుగులు తీయటం సామాన్యుల లక్షణం. నాకు వైరాగ్య మంటేనే ఇష్టం. తమ అడుగు జాడలే నాకు పరమపద సోపానాలు.

గురువు: (చిరునవ్వుతో) వత్సా! వయసుకు తగని మాటలు మాట్లాడుతున్నావు. మనస్సు చంచలమైనది. దానికి నిలకడ లేదు. మనస్సు ఎప్పుడు, ఎలా మారుతుందో చెప్పలేము. దాన్ని అదుపులో పెట్టుకోవటం వయస్సు ఉడిగిన వాళ్ళకే చేతకాదు... వయస్సులో వున్న వాడివి—నీకు చేతనవుతుందా? నా తిప్పలేవో నేను పడతాను. నన్ను విడిచి పెట్టి నీ సుఖం నువ్వు చూసుకో రాదా?

శిష్యుడు: (దీనంగా) గురువుగారూ! నేను తమకు భారంగా ఉంటే చెప్పండి. ఇక్కడే, మీ కళ్ళ ఎదుటే ఆత్మాహుతి చేసుకుంటాను. తమర్ని విడిచి మాత్రం బతకలేను.

గురువు: హరహరా! (అని చెవులు మూసుకున్నాడు. చేతులు తీసేసి) సరే, నాయనా! నువ్వెక్కడికీ

వెళ్ళకు. నా తోనే ఉండు. హరహరమహాదేవ! శంభోశంకర! నత్సా! ఈ పూటకు మనం వంట చేసుకోవాలి కద. ( జోలెలో చెయ్యి వేసి, గురివెంద గింజంత బంగారం తీసి ఇస్తూ ) ఇదిగో, ఈ బంగారం పట్టుకెళ్ళి వూళ్ళో అమ్మి సరుకులు కొనుక్కురా!.

శిష్యుడు: ( బంగారం తీసుకుని, ఒక జోలెలోని పాత్రలు తీసి నేల మీద ఉంచి ఖాళీ జోలె వంకకు తగిలించుకుని, అలాగే నిలబడ్డాడు. )

గురువు: నిలబడ్డా వేం. వెళ్ళక?

శిష్యుడు: గురుదేవా! ( మాట సాగలేదు )

గురువు: ( కొంత సేపు వేచి ) ఏమిటి?

శిష్యుడు: తప్పు పట్టనంటే ఒక మాట అడగాలని ఉంది.

గురువు: అడుగు.

శిష్యుడు: రోజూ గురివెంద గింజంత బంగారంఇచ్చి సరుకులు కొనుక్కు రమ్మంటున్నారు గదా! ఈ బంగారం ఎక్కణ్ణించి... ( ఆగి, చేతులు జోడించి ) నాకు మహా కుతూహలంగా ఉంది, గురువుగారూ!

గురువు: ( నవ్వి ) అదా నీ సందేహం! నా దగ్గర బంగారం... ( టక్కున మాట ఆపి, ఏదో ఆలోచిస్తూ రెండు క్షణాల పాటు మౌనంగా వుండి ) తరవాత తీరుబడిగా చెబుతానుగానీ, వేగిరం వెళ్ళి సరుకులు పట్టుకురా! కడుపులో ఆత్మారాముడు గోల పెడుతున్నాడు! వంట ప్రారంభించాలి కదా!

శిష్యుడు: ఇదిగో క్షణంలో వచ్చేస్తా! ( వెళ్ళిపోయాడు)

గురువు: ( శిష్యుడు కనుమరుగయ్యే వరకూ చూసి) ఆఖరికి అడగరాని మాటే అడిగి ఇరకాటంలో పెట్టేశాడే శిష్యుడు! ఏం చెప్పాలి వాడికి? ( జోలెలో చెయ్యి వేసి చిన్న బంగారపు ముద్ద బయటికి తీశాడు. దాన్ని చేతితో ఎగరేస్తూ ) నా దగ్గరున్న బంగారం ఇదే! ఇందులో నుంచి రోజూ గురివెంద గింజంత బంగారం ఖర్చుకు వాడుతున్నాను. ఈ సంగతి శిష్యుడికి తెలియదు. అడుగుతున్నాడు కనక ఇప్పుడు చెప్పాలి కదా! ( బంగారాన్ని మళ్ళీ జోలెలో వేసుకున్నాడు ) శిష్యుడేమో మంచివాడే! నమ్మదగిన వాడే అయితే, బగారాన్ని నమ్మలేము కదా? మంచి తనాన్ని మాయం చేసే గుణం బంగారానికే ఉంది. నిజం చెప్పి శిష్యుణ్ణి పాడు చెయ్యటం దేనికి ? ఈ బంగారం కోసం వాడు నాకేదైనా అపకారం తల పెట్టవచ్చు. అందుచేత ప్రస్తుతానికి ఏదో ఒక అబద్ధం చెప్పక తప్పదు.

శిష్యుడు: ( వచ్చాడు. ) వచ్చేశాను, గురువర్యా! బియ్యమూ, కూరగాయలూ తెచ్చేశాను.. ( జోలె, కట్టె పుల్లలూ కింద పెట్టాడు. )

గురువు: సరే! పొయ్యి తయారు చెయ్యి. ఇందాకా బంగారాన్ని గురించి అడిగావు కదూ? నీ కొక రహస్యం చెబుతాను. మరెవ్వరికీ చెప్పకూడదు సుమా!

శిష్యుడు : గురు దేవుల మీద ఒట్టు!

గురువు : నత్సా! నా దగ్గర బంగారం లేదు. బంగారం తయారు చేసే విద్య ఉంది. రాళ్ళను బంగారంగా మార్చే మంత్రం నాకు తెలుసు. మన అవసరాలు గడవటానికి, రోజూ గురివెంద గింజంత బంగారమైనా లేకపోతే ఎలా? అంతకంటే ఎక్కువ మన కెందుకు? మనం సర్వసంగ పరిత్యాగులం కదా!

శిష్యుడు : (విభ్రాంతుడై వింటూ ఉండిపోయాడు.)

గురువు : (శిష్యుడి భుజం మీద చెయ్యి వేసి) శిష్యా!

శిష్యుడు: (స్పృహలోకి వచ్చి, ముందుకు వంగి గురువు గారి పాదాలను కళ్ళకు అద్దుకున్నాడు.)

గురువు : నాయనా! నీ గురుభక్తి గొప్పది. దానికి ప్రతిఫలంగా నేను ఏమివ్వగలను? ఏమీ ఇవ్వలేను. (శిష్యుడి తల నిమిరాడు)...నువ్వు వంట పూర్తి చేసేలోపల, అదిగో ఆ కన బడుతున్న మంటపంలో కాసేపు నడుం వాలుస్తాను. సరేనా?...హర హర మహాదేవ! శంభోశంకర! (ఆయాసంగా విశ్రమించాడు.)

శిష్యుడు : (మూడు రాళ్ళు చేర్చి పొయ్యి చేశాడు.) ఇది రాళ్ళ పొయ్యి. గురువుగారు తలుచుకుంటే ఇదే బంగారు పొయ్యి...

## రెండవ రంగం (తెర)

(నేపథ్యంలో మంగళవాద్యాలు వినిపించి, క్రమంగా అంతరించిపోయాయి. గురువు పద్మాసనం వేసుకుని కూర్చుని ఉన్నాడు. శిష్యుడు నుంచున్నాడు.)

గురువు : నత్సా! చిల్లి జోలెలోంచి జారిపోయిన బియ్యంలా జరజర మంటూ ఎంతకాలం గడిచిపోయింది!

శిష్యుడు : అవును, గురుదేవా!

గురువు : అయినా, కాలాన్ని మనం వృధా చెయ్య లేదు. దర్శించవలసిన క్షేత్రాలన్నీ దర్శించాము. సేవించవలసిన తీర్థాలన్నీ సేవించాము. జన్మ పావనం చేసుకున్నాం. ఇక ఒక్క కోరిక మాత్రం మిగిలి ఉంది.

శిష్యుడు : ఆ కోరిక ఏమిటో అడగవచ్చా, గురుదేవా?

గురువు : కాశీ విశ్వనాథుని సన్నిధిలో శేష జీవితాన్ని గడిపివేస్తే, కైవల్యప్రాప్తి కలుగుతుందంటారు పెద్దలు. తెల్లవారగానే మనం కాశీకి ప్రయాణమవుదాం.

శిష్యుడు : గురువుగారూ!...(మాట ఆగింది.)

గురువు : ఏమి, నాయనా?

శిష్యుడు : తప్పు పట్టనంటే, నా సమస్య ఒకటి విన్నవిస్తాను.

గురువు : చెప్పు, బాబూ!

శిష్యుడు : చచ్చిపోయిన మా అమ్మ ఈ మధ్య తరచూ నా కలల్లోకి వస్తూ ఉంది. కడవల కొద్దీ కన్నీళ్ళు కారుస్తూ ఉంది. ఆమె ఆత్మ క్షోభిస్తూ ఉందట! నేను పెళ్ళి చేసుకుని కొడుకును కనాలట. వాణ్ణి పెంచి పెద్దచేసి ఒక ఇంటివాణ్ణి చెయ్యాలట. మళ్ళీ వాడికి కూడా కొడుకు పుట్టాలట. వాడికి కూడా పెళ్ళి చెయ్యాలట! అప్పుడేనట మా



అమ్మకు ఆత్మశాంతి!...ఇప్పుడు చెప్పండి, గురుదేవా! నన్ను తను వెంట కాశికి రమ్మంటారా? లేకపోతే పాపిష్ఠి, సంసార కూపంలో పడి, మా అమ్మకు ఆత్మశాంతి కలిగించకుంటారా?

గురువు : (కొంతసేపు మౌనంగా ఉండి, చిరునవ్వుతో) నాతోబాటుగా గంగలో దూకమని నేను మాత్రం ఎలా చెప్పగలను? మీ అమ్మగారికి ఆత్మశాంతి చేకూర్చటమే నీ విధి, నాయనా!

శిష్యుడు : ఇది అన్యాయం, గురుదేవా! తమరు కూడా నా పుట్టి ముంచేస్తున్నారు. సంసారమంటే పిల్లకాలువ అనుకున్నారా? అది మహా సముద్రం కదా. చేత చిల్లిగవ్వలేని నేను ఆ సముద్రాన్ని ఎలా ఈదగలననుకున్నారు?

గురువు : వెర్రి తండ్రీ! అదా నీ బెంగ? ఇన్నాళ్ళు నీచేత శుశ్రూషలు చేయించుకున్న వాణ్ణి నిన్ను ఉత్త చేతులతో పంపుతానా? (జోలెలో చెయ్యివేసి కొంత బంగారం తీసి ఇస్తూ) ఇదిగో, ఈ బంగారం తీసుకో— దీనితో నీ జీవితం సుఖంగా గడిచిపోతుంది.

శిష్యుడు : వద్దు, గురుదేవా! నాకు ఈ బంగారం వద్దు!

గురువు : ఇంకేం కావాలి?

శిష్యుడు : తమ శిష్యుడి క్షేమం కోసం తమరు చెయ్యగలిగింది చేస్తానని మాట ఇవ్వండి చాలు.

గురువు : నేను చెయ్యగలిగింది ఏదయినా ఉంటే, నీ కోసం కాక ఇంకెవరి కోసం చేస్తాను?... ఏం చెయ్యమన్నావో చెప్పు.

శిష్యుడు : గురువుగారూ! తమరు నాకిప్పుడు నిమ్మకాయంత బంగారం ఇస్తారే అనుకోండి. దాంతో ఎన్నాళ్ళు గడుస్తుంది? నన్ను కట్టుకోబోయే పిల్ల దుబారా మనిషే కావచ్చు. నాకు పుట్టబోయే పిల్లలు కొండను తెచ్చిపెట్టు, కొండమీది కోతిని తెచ్చిపెట్టు అని వేధించవచ్చు. నిమ్మకాయంత బంగారం ఏ మూలకి వస్తుంది? అందుచేత నన్ను తమరు కటాక్షించాలి— రాళ్ళను బంగారంగా మార్చే మంత్రం ఉపదేశించండి. నాకు మాట ఇచ్చారు, గురుదేవా! తమరు ద్రోణాచార్యులంతటివారు. శిష్యుడి కోసం ఏమైనా చేస్తారు. (చేతులు జోడించాడు.)

గురువు : (గుక్కిళ్ళు మింగాడు.)

శిష్యుడు : అదేమిటి, గురువుగారూ! ఉలుకూ పలుకూ లేకుండా అలా నోరు చప్పరిస్తున్నారు?

గురువు : అబ్బే! మరేంలేదు...మంత్రం జ్ఞప్తికి తెచ్చుకుంటున్నాను.

శిష్యుడు : (ఆశ్చర్యంగా) మంత్రం జ్ఞప్తికి తెచ్చుకోవటమేమిటి? రోజూ బంగారం తయారు చేస్తూనే ఉన్నారుగా?

గురువు : ఈ మధ్య మతి స్థిమితంగా ఉండటం లేదు, శిష్యా! అరవై దాటితే అరుంధతీ అని ఊరికే అన్నారా?... సరే తెల్లవారాక కాశికి బయలుదేరే ముందు నీకు మంత్రోపదేశం చేస్తానులే! ఇక పడుకుందామా?

శిష్యుడు : ధన్యోస్మి, గురుదేవా, ధన్యోస్మి! ఏవీ తమ పాదాలు? నా నెత్తిన పెట్టుకుంటాను.

గురువు : ఆ పనేదో తెల్లవారాక చెయ్యొచ్చులే. ఇప్పుడు నిద్ర ముంచుకొస్తూ ఉంది. (ఆవలించాడు.)

శిష్యుడు : అలాగే, అలాగే! నేను తమరి కాళ్ళు ఒత్తుతూ కూర్చుంటాను. తమరు హాయిగా నిద్రపొండి. (గురువు పడుకున్నాడు. శిష్యుడు కొంతసేపు కాళ్ళుపట్టాడు. గురువుగారు గురక పెడుతున్నారు. శిష్యుడు లేచి వెళ్ళి తన పక్క మీద పడుకుని నిద్రపోయాడు.)

గురువు: (లేచి కూర్చుని, శిష్యుడి వైపుచూశాడు.) కొంప ముంచాడు. మంత్రోపదేశం చెయ్యాలట. వీడి పిండాకూడు! బంగారం చెయ్యటం నాకు తెలిసిచస్తే గదా వీడికి చెప్పటానికి! తీరా ఇంత జరిగాక, ఇప్పుడు నాకేమీ తెలియదురా, పిచ్చి సన్యాసీ అంటే ఒప్పుకుంటాడా? ఏదో అవసరానికి చిన్న అబద్ధం ఆడి, అడకత్తెరలో ఇరుక్కుపోయాను. ఇప్పుడేం చెయ్యాలి? (శిష్యుడి వైపు చూశాడు) నిద్రపోతున్నాడు. (మెల్లగా రెండుసార్లు చప్పట్లు చరిచాడు.) మంచినిద్రలోనే ఉన్నట్టున్నాడు. వీడు లేవకముందే గంతా బొంతా సర్దుకుని చల్లగా జారుకోవడం మంచిది. (జోలె తగిలించుకున్నాడు. భుజాన కంబళి వేసుకున్నాడు. దండమూ, కమండలమూ చేతికి తీసుకున్నాడు. నాలుగడుగులు ముందుకు వేశాడు. ఆగిపోయాడు.) ఇప్పుడు పారిపోతే, వీడు మళ్ళీ వెంబడించడా అన్న నమ్మకమేముంది? పరుగెత్తు కొచ్చి పాదాలు పట్టుకుంటాడు. మళ్ళీ చిక్కులు తప్పవు. (మళ్ళీ వెనక్కి వచ్చాడు. కొంతసేపు ఏదో ఆలోచించాడు.) సరే! చాటుగా వెళ్ళిపోవటం వల్ల లాభం లేదు. ఏదో ఒక ఉపాయంతో వీణ్ణి తృప్తి పరచి వదిలించుకోవటమే మంచిది. (మళ్ళీ వెళ్ళి యథాస్థానంలో పడుకున్నాడు.) హరహర మహాదేవ! శంభోశంకర! (నిద్రపోయాడు. కొంతసేపటికి కోడికూత, కాకుల అరుపులు, గుడిగంట మోత)

శిష్యుడు : (లేచి కూర్చున్నాడు. కళ్ళు నులుముకున్నాడు) గురువుగారూ! గురువుగారూ! లేవండి. తెల్లవారింది.

గురువు : (అదిరి పడి లేచాడు) ఆఁ? తెల్లవారిందా? అప్పుడే తెల్లారిపోయిందా? హరహర మహాదేవ! శంభోశంకర!

శిష్యుడు! గురువుగారూ! తమరు కాశికి ఇప్పుడే బయలుదేరుతున్నారా?

గురువు : ఏం, నాయనా? కోతిమంత్రం నేర్చుకోవాలని తొందరగా ఉందా?

శిష్యుడు! కోతిమంత్రమా! ఆదేమిటి గురువుగారూ!

గురువు : అదేనోయ్! బంగారం మంత్రం. కాలకృత్యాల మాట తరవాత చూసుకోవచ్చు గానీ, ఇలావచ్చి కూర్చో— మంత్రం నేర్పుతా! మంత్రోపదేశానికి ఈ వేకువపూట చాలా అనువుగా ఉంది.

శిష్యుడు : (గురువు గారి ముందర మోకరిల్లి కూర్చున్నాడు.)

గురువు : ఆ దండమూ, కమండలమూ ఇలా అందుకో!

శిష్యుడు : (అందించాడు.)


గురువు : (దండాన్ని శిష్యుడి నెత్తిన తాటించి) నేను చెప్పేది శ్రద్ధగా విను. నేను ఉపదేశించబోయేది బంగారం మంత్రమే అయినా

## బాలప్రతిభ





రాష్ట్ర ప్రభుత్వం గుంటూరులో నిర్వహించిన సంస్కృత వక్తృత్వ పోటీలలో బహుమతులు గెలుచుకున్న మాతృశ్రీ ఓరియంటల్ కాలేజి (జిల్లెళ్ళమూడి) విద్యార్థులు ఈమని కాళికేశ్వరశర్మ (వ్యాకరణం—ప్రథమ బహుమతి), కుమారి వీరుభొట్ల రుక్మిణి (సాహిత్యం—ద్వితీయ బహుమతి)




దాని పేరు కోతి మంత్రం! దాని పేరు ఏమి మంత్రం?

శిష్యుడు : కోతి మంత్రం!

గురువు : దాని పేరు ఏమి మంత్రం?

శిష్యుడు : కోతిమంత్రం!

గురువు : మళ్ళీ అను!

శిష్యుడు : కోతిమంత్రం!

గురువు : వరసగా అంటూ ఉండు

శిష్యుడు : కోతిమంత్రం ..( అని వరసగా ఏడెనిమిదిసార్లు అన్నాడు.)

గురువు : ఇక ఆపు (శిష్యుడు ఆపాడు.) ఇన్నిసార్లు ఎందుకు చెప్పమన్నానంటే, మంత్రం పేరు మరచిపోవచ్చా?

శిష్యుడు : మరచిపోకూడదు.

గురువు: ఆ! అందుకన్నమాట. ఇక మంత్రోపదేశం చేస్తాను పట్టు! (కమండలంలోనుంచి శిష్యుడి చేతిలోకి ధార వదిలాడు) ఏదీ నేను చెప్పబోయే మంత్రాన్ని ఉచ్చరించు.. హే శిలే, స్వర్ణంభవ!

శిష్యుడు : హే శిలే! స్వర్ణంభవ!

గురువు : హే శిలే! స్వర్ణంభవ!

శిష్యుడు! (చెప్పాడు)

గురువు : హే శిలే! స్వర్ణంభవ!

శిష్యుడు: (చెప్పాడు.)

గురువు : ఈ మంత్రం పేరేమిటన్నాను?

శిష్యుడు : కోతిమంత్రం!

గురువు : భళా! ఇక నువ్వు చేయవలసిందేమిటో శ్రద్ధగా విను! సరిగ్గా అర్ధరాత్రి పూట కలశంలో నీళ్ళు తీసుకో! ఏకాంత స్థలంలో కూర్చో! చుట్టూ ఒకసారి చూసుకో— ఆ పొలిమేరల్లో ఎక్కడా కోతి కనిపించ కూడదు. కోతి కనిపించటం లేదని రూఢి చేసుకున్నాక, కళ్ళు మూసుకుని 'హే శిలే స్వర్ణంభవ' అని ఎనిమిదిసార్లు మంత్రోచ్చాటన చేస్తూ మామిడాకుతో రాతి మీద, జలాన్ని ప్రోక్షించు. కళ్ళు తెరిచి చూడు. రాయి బంగారమై ఉంటుంది! అయితే ఒక సంగతి మాత్రం బాగా గుర్తుంచుకో! నువ్వు మంత్రం చదివేటప్పుడు కోతిని మాత్రం తలుచుకోకూడదు. తలుచుకున్నావో బంగారం తయారుకాదు. నువు నా ప్రియ శిష్యుడివి కనుక ఈ మంత్రం నీకు నేర్పాను. కోతిని తలుచుకోకుండా ఉండగలవా?

శిష్యుడు: అ దెంత పనిలెండి, గురువుగారూ! కోతిని తలుచుకోకుండా ఉండలేనా!

గురువు: శుభం! ఇక నేను కాశీకి బయలుదేరుతున్నాను, నాయనా!

శిష్యుడు: వెళ్ళిరండి! (నమస్కరించాడు)

గురువు: (వెళుతూ వెనక్కి చూసి) జాగ్రత్త! కోతిని మాత్రం తలుచుకోవద్దు సుమా! కోతి మంత్రం మరిచిపోకు! (వెళ్ళిపోయాడు)

శిష్యుడు: (సంతోషంగా ఒక రాయి చేతికి తీసుకుని ముద్దు పెట్టుకుని) హే శిలే! స్వర్ణంభవ కోతిని మాత్రం తలుచుకో కూడదు.

## మూడవ రంగం (తెర)

(ఒకచోట చిన్న రాళ్ళకుప్ప. పక్కన మామిడి ఆకు ఉంచిన చెంబు. శిష్యుడు చేతులతో కొన్ని రాళ్ళు తెచ్చి కుప్పమీద ఉంచాడు.)

శిష్యుడు: (కుప్ప వైపు చూసి) ఊహుఁ! ఇది చాలా తక్కువే. ఇంకా కొన్ని రాళ్ళు తెస్తాను. దేవుడి దయ వల్ల రాళ్ళకు కొరత లేదు. గురువుల దీవెన వల్ల బంగారానికి కొదవ లేదు. (రంగం మీది నుంచి చాటుకు వెళ్ళి, మరి కొన్ని రాళ్ళు ఏరి తెచ్చి కుప్పలో వేశాడు.) (ఈ బంగారంతో రాజభవనం లాంటి మేడ కట్టిస్తాను. వస్తువాహనాలు కొంటాను. నౌకర్లనూ, చాకర్లనూ పెట్టుకుంటాను. నా వైభవం చూసి రాజ్యం లోని ధనవంతులంతా నన్ను గౌరవిస్తారు. వాళ్ళను విందుకు పిలుస్తాను. వాళ్ళు వచ్చినప్పుడు బంగారు పళ్ళాలలో కదా వడ్డన చెయ్యాలి? (రాళ్ళ వైపు చూశాడు.) ఊహు! ఈ రాళ్ళు చాలవు. (మరో వైపు వెళ్ళి, మరి కొన్ని రాళ్ళు తెచ్చి కుప్పలో వేశాడు.)

కోటీశ్వరులంతా వెళ్ళి నా వైభవం గురించి రాజుగారితో చెబుతారు. రాకుమారి నన్నే చేసుకుంటానని మొరాయిస్తుంది. కూతురి ముచ్చట చెల్లించక పోతే వాడేం రాజు! రాజు నా దగ్గరి కొచ్చి బతిమాలుకుంటాడు. రాజుగారే వచ్చి అడిగినప్పుడు సరే అనక తప్పుతుందా? రాకుమారికీ, నాకూ పెళ్ళి జరిగి పోతుంది. దేవతలంతా పుష్పవర్షం కురిపిస్తారు. ఔనూ, పెళ్ళి కూతురుకి మోపెడు నగలు చేయించక పోతే నా పరువేమవుతుంది? (కుప్ప వైపు చూశాడు) ఊహు! ఈ రాళ్ళు చాలవు. మరి కొన్ని తెస్తాను. (మళ్ళీ వెళ్ళి కొన్ని రాళ్ళు తెచ్చి కుప్పలో వేశాడు.)

ఇప్పటికి ఈ బంగారం చాల్లే! చేతిలో ఉన్న విద్యే కదా? అనుకున్నప్పుడల్లా తయారు చేసుకో వచ్చు. ఇక కోతి మంత్రం జపించి, రాళ్ళను బంగారంగా మారుస్తాను. (వెళ్ళి రాళ్ళ దగ్గర కూర్చున్నాడు.)

(గురువుగారి మాటలు స్మరణకు వస్తున్నాయి. నేపథ్యంలోంచి 'నువు మంత్రం చదివేటప్పుడు కోతిని మాత్రం తలచుకో కూడదు' అనే వాక్యం వరసగా మళ్ళీ మళ్ళీ వినిపిస్తూనే ఉంది.)

శిష్యుడు: (చెవులు మూసుకుని) సరే! కోతిని తలుచుకోను. (చెంబు చేతికి తీసుకున్నాడు.)

గురువుగారి మాటలు: చుట్టూ ఒకసారి చూసుకో— ఎక్కడా కోతి కనిపించకూడదు.

శిష్యుడు: (చుట్టూ, ఒకసారి చూశాడు.) లేదు. ఎక్కడ గానీ కోతి కనిపించటం లేదు. ఇక కోతి మంత్రం జపిస్తాను. (రాళ్ళ మీద నీళ్ళు చిలకరిస్తూ) హే శిలే! స్వర్ణంభవ! హే శిలే! స్వర్ణంభవ!

నేపధ్యంలో: (గతంలోని గురుశిష్యుల సంభాషణ) దాని పేరు ఏమి మంత్రం? కోతి మంత్రం! మళ్ళీ అను. కోతి మంత్రం. వరసగా అంటూ ఉండు! కోతి మంత్రం. కోతి మంత్రం. కోతి మంత్రం. కోతి మంత్రం.

శిష్యుడు: హే శిలే! స్వర్ణంభవ! హే శిలే! స్వర్ణంభవ!

గురువుగారి మాటలు: నువ్వు మంత్రం చదివేటప్పుడు కోతిని మాత్రం తలుచుకోకూడదు. అలా తలుచుకుంటే రాయి బంగారం కాదు.

శిష్యుడు: హే శిలే! స్వర్ణంభవ! హే శిలే! స్వర్ణంభవ! (కళ్ళు తెరిచి ఆత్రుతగా రాళ్ళ మీదికి వంగి చూశాడు) ఛీ పాడుకోతి! కాస్సేపు జ్ఞప్తికి రాకుండా ఉండదు కదా. రాళ్ళు రాళ్ళుగానే ఉన్నాయి. ఈ సారి ప్రయత్నిస్తాను. ఇహ చస్తే కోతిని తలుచుకో కూడదు. (కళ్ళు మూసుకున్నాడు. నీళ్ళు చిలకరిస్తూ) హే శిలే! స్వర్ణంభవ! పాడు కోతి...హే శిలే! స్వర్ణంభవ! ఛీ వెధవ కోతి! హే శిలే! స్వర్ణంభవ! కోతిన్నర కోతి! హే శిలే! స్వర్ణంభవ! దీన్ని పాతెయ్య! హే శిలే! స్వర్ణంభవ! (పళ్ళు నూరుతూ) దీన్ని

ముక్కలు ముక్కలుగా నరికి పోగులు పెట్టా. హే శిలే! స్వర్ణంభవ! ( నెత్తి న మొట్టి కాయ వేసుకున్నాడు ) హే శిలే! స్వర్ణంభవ! (గట్టిగా నెత్తి బాదుకున్నాడు. )

( తెర )

## నాలుగవ రంగం

(గురువుగారు దారి వెంట నడుస్తూ, అయా సంగా ఆగాడు. )

గురువు : హరహర మహాదేవ్! శంభో శంకర! … శిష్యుడు వెంటలేకపోవటం కాస్త ఇబ్బందిగానే ఉంది. అయినా చేసేదేముంది? బంగారం మీది వ్యామోహంతో వాడు నాకు దూరమై పోయాడు. వాణ్ణి వదిలించుకుని వచ్చి ఇవా ళిటికి వారం రోజులైంది. వాడు రాళ్ళు ముందేసుకుని కోతిని తలుచుకుంటూ ఉంటాడు. ఉపాయంగా వాడిమీదే నెపం వేసి వచ్చేశాను. ఇక వాడు నా వెంటబడడు. వాడిదారి వాడిది, నా దారి నాది! (కూర్చు న్నాడు. )

శిష్యుడిగొంతు : గురువర్యా! గురువర్యా!

గురువు : ( ఉలికిపడి లేచాడు. దూరానికేసి చూస్తూ ) ఎవరదీ? వాడేనా … చచ్చానుపో! ఆ పరి గెత్తు కొస్తున్న వాడు శిష్యుడే! మళ్ళీ వెంట బడుతున్నా డేమిటి? ( తొందర తొందరగా రంగం మీదినుంచి నిష్క్రమించాడు. )


శిష్యుడు : ( రెండోవైపు నుంచి పరుగు పరుగున వచ్చాడు.) ఆగండి! ఆగండి, గురువర్యా!

( గురువు వెళ్ళిన వైపే పరుగు తీశాడు. గురువు మళ్ళీ రంగం మీదుగా పరుగు తీశాడు. తరవాత వెంటబడుతూ శిష్యుడు. మూడోసారి గురువు వెనుదిరిగి చూస్తూ రంగం మీదికి వచ్చాడు. శిష్యుడు ఈ సారి ఎదుటి వైపు నుంచి వచ్చి తారసపడ్డాడు. )

శిష్యుడు : గురువర్యా!

గురువు : (అదిరిపడి) ఏమిటిది? మళ్ళీ ఎందు కొచ్చావు?

శిష్యుడు : కాశీకి వెళ్ళినవాడూ, కాటికి వెళ్ళినవాడూ



ఒకటే నన్నారు. తమరు బతికుండగానే వెతికి పట్టుకోవడం నా అదృష్టం గురుదేవా!

గురువు : వత్సా! నన్ను విసిగించకు. నా దారికి అడ్డు రాకు. (ముందుకు వెళ్ళబోయాడు.)

శిష్యుడు : గురుదేవా! నేను తమదారికి అడ్డురాను. ఒక చిన్న కోరిక తీర్చి వెళ్ళండి. అంతేచాలు.

గురువు : నీ గొంతెమ్మ కోరికలు తీర్చటం నా తరం కాదు బాబూ. నన్ను పోనియ్ .

శిష్యుడు : గొంతెమ్మకోరిక కాదు, మహాత్మా! అవ గింజంత కోరికే. తమవల్ల సాధ్యమయ్యేదే! ( చుట్టూచూశాడు. మోయగలిగినంత పెద్ద బండరాయి ఒకటి తెచ్చి గురువుగారి ముందర పెట్టాడు) ఈ రాతిని బంగారంగా మార్చే యండి. పట్టుకెళ్ళిపోతాను.

గురువు : ఆ పనేదో నువ్వే చేసుకోరాదూ? మంత్రం నేర్పానుగదా!

శిష్యుడు : మంత్రం నేర్పారు సరే కానీ, మనస్సును నిలకడగా ఉంచుకోలేక పోతున్నాను, గురువు గారూ! వరసగా మూడు రాత్రులు మంత్రం జపించినా, బంగారం తయారు కాలేదు. కోతి జ్ఞప్తికి రాని క్షణమే లేదు. ఏకాగ్రతలేని నాకు తమరు నేర్పిన మంత్రం ఎందుకూ పనికిరాదు.

గురువు : వత్సా! కోతి ఒకచోట కుదురుగా ఉండటం ఎప్పుడైనా చూశావా? మనస్సు కూడా కోతి లాంటిది. మనస్సును నిలకడగా పెట్టు కోవడం ఎవరితరమూ కాదు. నాయనా! నీకు పనికిరాని మంత్రం నాకు కూడా పనికిరాదు.

శిష్యుడు : అబద్ధం చెప్పకండి, గురువుగారూ! చాలా సార్లు తమరు బంగారం తయారుచేశారు కదా?

గురువు : అదే, నాయనా, నేను చెప్పిన అబద్ధం. రాళ్ళను బంగారంగా మార్చటం నాకు చేత కాదు. నా దగ్గర కొంత బంగారం ఉంది, ఆ సంగతి నీకు తెలిస్తే, దురాలోచనకు పాల్పడతావేమోనని, అబద్ధమాడాను. నీకు నేర్పిన మంత్రం ఉత్తదే. రాయీ! బంగా రంగా మారిపో అంటే ఎలా మారిపోతుంది?

శిష్యుడు : గురువుగారూ! నన్ను తమరు మోసం చేశారు. ఘోరంగా మోసంచేశారు. (బావురు మంటూ ఏడ్చాడు.)

గురువు : (శిష్యుడి వీపు నిమురుతూ) నాయనా! శాంతించు. అత్యాశలకు పోతే ఎదురయ్యేది ఆశాభంగమే! ఎప్పటికీ అందని స్వర్గం కంటే, ఇప్పుడు చేతికందే ఉట్టి మేలు!

శిష్యుడు : (చేతులు జోడించి) గురువుగారూ! తప్పుపట్టనంటే, ఒక పెద్ద కోరిక కోరు తాను. తమరు తీర్చగలిగేదే!

గురువు : అప్పుడు నే నివ్వబోతే వద్దన్నావే… ఆ బంగారమే కదా?

శిష్యుడు : చిత్తం! అదే…అదేచాలు!

గురువు : ( జోలెలో చెయ్యివేసి, బంగారంతీసి) తీసుకో! (శిష్యుడికి ఇచ్చాడు ) తృప్తిగా జీవించు! (ఆశీర్వదించాడు. )

శిష్యుడు : (గురువుగారికి సాష్టాంగ ప్రణామం చేశాడు. )

( తెర )

